ప్రజాశక్తి
మంగళవారం 14 జనవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రెవెన్యూ సదస్సులకు 7092 దరఖాస్తులు

- పరిష్కారానికి కసరత్తు
- మ్యుటేషన్‌పై అత్యధికం



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8 వరకు 710 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 45 రకాల సమస్యలకు సంబంధించిన 7092 దరఖాస్తులొచ్చాయి. వీటిలో అత్యధిక దరఖాస్తులు ప్రతి సోమవారమూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పరిష్కారంకానివే ఉన్నాయి. వివిధ తరగతుల ప్రజలు ఏళ్ల తరబడి కలెక్టరేట్‌ల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోకపోవడంతో రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్నారు. వీటి పరిష్కారానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. భూ సంబంధిత సమస్యల్లో గ్రామ, మండల స్థాయిల్లో పరిష్కరించగల్గిన న్యాయమైన స్వల్ప సమస్యలున్నాయి. రెవెన్యూ యంత్రాంగం చొరవ తీసుకోకపోవడంతో భూ సమస్యలు క్రమంగా పెరుగుతున్నాయి. 7092 దరఖాస్తుల్లో 2,943 మ్యుటేషన్‌కు (యజమాని పేరుమార్పు) సంబంధించినవి ఉన్నాయి. సరిహద్దులు గుర్తింపు సమస్యలు 860, రెవెన్యూ రికార్డుల్లో పేరు, బంధుత్వం, ఆధార్, ఫోన్ నెంబరు వంటివి నమోదు, సరిచేయాల్సినవి 821, పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరుకు 665, ఎస్‌ఎల్‌ఎ ధ్రువీకరణపత్రాల ఆలస్యంపై 336, విస్తీర్ణంలో తేడాపై మిగతా 2లో..

గడువులోపు సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించనున్నాం. ప్రతి దరఖాస్తును పరిశీలించనున్నాం. అవి ఏ స్థాయిలో ఉన్నాయనేది గుర్తించి గడువులోపు పరిష్కరించనున్నాం.



ఎం.జాహ్నవి, జాయింట్ కలెక్టర్



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

వార్తలు 7లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భోగి మంటలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు



పట్నం ఊరెళ్లింది

బోసిపోయిన రోడ్లు

వార్త 2లో..

విశాఖలో నిర్మానుష్యమైన రహదారులు

మొదటి పేజీ తరువాయి..

రెవెన్యూ సదస్సులకు 7092 దరఖాస్తులు

245, కుల ధ్రువీకరణ పత్రాలపై ఫిర్యాదులు 173, భూముల ఫ్రీ హోల్డ్‌పై 107 దరఖాస్తులొచ్చాయి. 8 అంశాలకు సంబంధించి వందకుపైబడి దరఖాస్తులొచ్చాయి. ప్రభుత్వ, ప్రయివేటు భూముల ఆక్రమణలపై ఫిర్యాదులొచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 45 రోజుల్లో పరిష్కరించాల్సివుంది. వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతల వారీగా గుర్తించి గడువులోపు పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఎన్‌సిసి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లా స్థాయి ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం ప్రారంభమైంది. 356 మంది జూనియర్, సీనియర్ ఎన్‌సిసి క్యాడెట్లు హాజరయ్యారు. ఈ నెల 20వ తేదీ వరకు జరుగనున్న శిక్షణా శిబిరంలో సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, త్రోబాల్, పతంగులు, రంగోలి, ఇతర అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు, కార్యదర్శి రమాదేవి, ఎన్‌సిసి ప్రోగ్రాం అధికారులు కృష్ణకిషోర్, అశోక్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు హెల్పింగ్ హ్యాండ్స్ కేలండర్‌ను సోమవారం జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు ఆవిష్కరించారు. సంస్థ వ్యవస్థాపకులు పల్లంటి శ్యామ్ సుందరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గుడిలోవ విజ్ఞానవిహార 45వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కళా ప్రదర్శనలు అహుతులను అలరించాయి. 8, 9, 10వ తరగతి విద్యార్థులు మణిపూర్ నృత్యం ప్రదర్శించారు. 8వ తరగతి విద్యార్థులు వృక్షో రక్షతి రక్షిత: నాటకాన్ని ప్రదర్శించారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వారి ఇంటర్నేషనల్ మాథమాటిక్స్ ఒలింపియాడ్ లెవెల్ - 1 ఎగ్జామ్స్‌లో బోయిపాలెం ఎస్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎనిమిది బంగారు పతకాలతో ప్రతిభ చాటారు. ఆరవ తరగతి నుంచి కె.శ్రీధర్మశాస్త్ర, వి.దానేష్, డి.సునందిత్, ఏడవ తరగతి నుంచి బి.భానుప్రకాష్, కె.ఉషశ్రీ, ఎం.ఛాయాశ్రీ, ఎనిమిదవ తరగతి నుంచి బి.జగదీష్, తొమ్మిదవ తరగతి నుంచి ఎస్.తరుణి ప్రియ బంగారు పతకాలతో మెరిశారు. వీరిలో కె.శ్రీధర్మశాస్త్ర, బి.భానుప్రకాష్, బి.జగదీష్ లెవెల్ - 2 ఎగ్జామ్స్‌కు అర్హత సాధించారని పాఠశాల డైరెక్టర్ శాంతిచిత్ర తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయులు సూర్య గౌరీ శ్రీదేవికి శుభాకాంక్షలు తెలియచేశారు.

డాక్టర్ జయగోపాల్‌కు పెరియార్ అవార్డు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ల వ్యవస్థాపకులు పెరియార్ ఆశయ సాధన సంఘం చైర్మన్, అంతర్జాతీయ మానవ హక్కుల నేత డాక్టర్ జయగోపాల్‌కు పెరియార్ అవార్డు ఆయన మరణానంతరం అందజేయనున్నట్టు పెరియార్ తమిళ్ ఫోరం, ద్రవిడ కజగం చెన్నై నాయకులు తెలియజేశారని, ఆ మేరకు ఈ నెల 15 న చెన్నైలో జరగబోయే ఒక కార్యక్రమంలో జయగోపాల్ కుటుంబ సభ్యులకు ఇస్తున్నట్టు భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామ్మూర్తి, వై.నూకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 1972లో ఆయన స్థాపించిన భారత నాస్తిక సమాజం ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూఢనమ్మకాల నిర్మూలనా ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటుందని, దానికి అనుబంధంగా ఆయన స్థాపించిన సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో కీలకమైన బాధ్యత తీసుకుందని పేర్కొన్నారు. జయగోపాల్‌కు పెరియర్ అవార్డు రావడం పట్ల ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సంక్రాంతి వినోదం.. అధిక భారం

చుక్కల్లో సినిమా టిక్కెట్ల ధరలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా సినిమా థియేటర్లలో కొత్త సినిమా, ముఖ్యంగా ప్రముఖ హీరోలుగా పిలవబడే వారు నటించిన భారీ బడ్జెట్ సినిమాలను చూడాలంటే వినోదాన్ని కొనుగోలు చేయటమేనని ప్రేక్షకులు నిట్టూరుస్తున్నారు. దీనికి కారణం భారీ బడ్జెట్ చిత్రాల టికెట్లు రేట్లు సంక్రాంతి వంటి ముఖ్య పండగల దినాలలో 10 నుంచి 15 రోజులు పాటు పెంచుకుని అమ్మకాలు చేసే వెసులుబాటును ప్రభుత్వమే కల్పిస్తోంది. అన్ని తరగతుల ప్రజలను అలరించే సినిమా ఇప్పుడు సగటు ప్రేక్షకులకు బహు భారంగా మారింది. టిక్కెట్ల ధరలు చుక్కల్ని తాకుతుండడంతో జేబులు గుల్లపుతున్నాయి. విశాఖ నగరంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో ఉన్న థియేటర్లలో సంక్రాంతి సందర్భంగా టికెట్ల ధరలను పెంచుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీనిని ఆసరాగా చేసుకొని కొన్ని థియేటర్ల యాజమాన్యాలు యథేచ్ఛగా 'బ్లాక్ టిక్కెట్ల దందా కొనసాగిస్తున్నారు. విషయం తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. విశాఖ నగరంలో మల్టీప్లెక్స్ స్క్రీన్లు కలుపుకొని 40 వరకు థియేటర్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మరో 40 వరకు ఉన్నాయి. వీటిలో కొన్ని థియేటర్లు పెద్ద హీరోలకు చెందిన భారీ బడ్జెట్ చిత్రాలను సంక్రాంతి సందర్భంగా ప్రదర్శిస్తున్నాయి. టికెట్లు ధరలు భారీగా పెరగడంతో సామాన్య మధ్య తరగతి ప్రేక్షకులకు సినిమా భారంగా మారిందనే చెప్పవచ్చు. రూ.100 అమ్మే ఒక్కో టిక్కెట్ ధర రూ.250 నుంచి రూ.350కి కౌంటర్ల వద్దే విక్రయిస్తున్నారు.

సినిమాను, హీరో, సీజన్ డిమాండ్‌ను బట్టి టిక్కెట్ల ధరలను పెంచుతున్నారు. బ్లాక్ టిక్కెట్ ధరలు మరింత పెంచుతున్నారు. ఇటీవల విడుదలైన అగ్ర హీరోల సినిమా టిక్కెట్ల ధరలు ఏకంగా రూ.300, రూ.500కు విక్రయిస్తున్నారు. బ్లాక్‌లో అయితే రూ.600 నుంచి రూ.800పైమాటే. మాములు సినిమాలైతే రూ.300 వరకూ అమ్ముతున్నారు. వారాంతాలు, పండుగ సీజన్లలో ఒక కుటుంబం సినిమాకు కనీసం రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే విడుదలైన పుష్ప-2 సినిమాకు బెనిఫిట్ షో పేరుతో ఒక్కో టిక్కెట్ ను రూ.1000 నుంచి రూ.1200కు విక్రయించారు. మూడు రోజుల క్రితం విడుదలైన గేమ్ చేంజర్ సినిమాకు కూడా ఫ్యాన్స్ పేరుతో రూ.1000 పైనే టిక్కెట్టు ధర వసూలు చేశారు. సంక్రాంతి నేపథ్యంలో ఇప్పటికే విడుదలైన ఢాకూ మహారాజ్, మంగళవారం విడుదలన కానున్న సంక్రాంతికి వస్తున్నాం వంటి భారీ చిత్రాల టిక్కెట్లు ధరలు కూడా పెంచుకునే వెసులుబాటు లభించింది. ఇటువంటి భారీ చిత్రాల టికెట్లు ధరలు మొదటి వారం రోజులు రూ.300 వరకు కౌంటర్లోనే విక్రయిస్తున్నారు. వారం తర్వాత రూ.250 ఉంటుందని పలు థియేటర్ల యజమానులు తెలిపారు.

పండుగలు, సెలవులు, వారంతాలు వంటి ప్రత్యేక రోజుల్లో బ్లాక్ టికెట్ల ధరల విక్రయం విచ్చలవిడిగా సాగుతోంది. థియేటర్ల సిబ్బందే టికెట్లను అధిక ధరకు అమ్ముతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. థియేటర్లలో మాదిరిగానే ఆన్ లైన్‌లోనూ టిక్కెట్లను అమ్ముతున్నారు. ఫస్ట్ క్లాస్ రూ.250, సెకండ్ క్లాస్ రూ.200గా విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా థియేటర్లను బట్టి వీటి ధరలు పెరుగుతాయి. 50 శాతం టిక్కెట్లను మాత్రమే ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెడతారు. మిగిలినవి కౌంటర్లో విక్రయించాలి. ఒకే వ్యక్తి పేరుతో నాలుగు టిక్కెట్ల వరకూ బుక్ చేస్తున్నారు. అలా బుక్ చేసిన టిక్కెట్లను బ్లాక్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను అదుపు చేయాలని పలువురు కోరుతున్నారు.

పట్నం ఊరెళ్లింది

బోసిపోయిన రోడ్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హిందువుల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా నగరంలో నివసిస్తున్న అధిక సంఖ్యలో ప్రజలు పండగ చేసుకోవడం కోసం తమ సొంత ఊర్లకు తరలి వెళ్లారు. దీంతో నగరంలో రణగొణ ధ్వనులు సద్దుమణిగాయి. రోడ్లపై వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. నిత్యం రద్దీగా ఉండే అనేక రోడ్లు నిర్మానుషంగా మారిపోయాయి. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గం, అంబేద్కర్ విగ్రహం నుంచి పాత జైల్ రోడ్డు, డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లే రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. నగరాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిలో కూడా వాహనాలు అతి తక్కువ నడుస్తుండడంతో నిర్మానుష్యం చోటుచేసుకుంది. నగరంలో నిత్యం సుమారు రెండు లక్షల మేర ద్విచక్ర వాహనాలు, వేల సంఖ్యలో ఫోర్ వీలర్లు అన్ని రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటాయి. అన్ని రోడ్లు ప్రశాంతంగా కనిపిస్తుండటంతో శబ్ద కాలుష్యం దాదాపు లేకుండా పోయింది. నిత్యం కొనుగోలుదారులతో కలకలలాడే ఫిషింగ్ హార్బర్ కూడా పూర్తిగా నిర్మానుష్యంగా మారిపోయింది. నగరం నడిబొడ్డున ఉన్న పూర్ణా మార్కెట్‌లో చాలావరకు దుకాణాలు మూతపడ్డాయి. హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ మూడు రోజులపాటు సెలవు ప్రకటించారు. నగరంలోని 13 రైతు బజార్లలో కూడా అతి తక్కువ దుకాణాలు మాత్రమే ఉన్నాయి. వాటికి బేరాలు లేని పరిస్థితి ఉంది. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో సంక్రాంతి కోసం గ్రామాలకు వెళ్లిన ప్రజలు కుటుంబాలతో కలిసి తిరిగి ఈ నెల 17వ తేదీ తర్వాత మాత్రమే వచ్చే అవకాశం ఉంటుంది.

కబడ్డీ జట్లకు వంశీకృష్ణ అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కర్నూలు జిల్లాలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగిన 50వ అంతర్ జిల్లాల బాల, బాలికల కబడ్డీ పోటీలలో ప్రథమ బహుమతి విజేతగా నిలిచిన జట్టు క్రీడాకారులను ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అభినందించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మరిన్ని విజయాలను సాధించాలని, వారికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, ఎం.ఉమాశంకర్ బాబు, వి.బాబూరావు, ఎం.గణపతిరావు, కోచ్ వసంత్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

గెలాక్సీ ఎస్ సిరీస్ ముందస్తు రిజర్వేషన్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌ను వినియోగదారులు సోమవారం నుంచి ముందస్తు రిజర్వ్ చేసుకోవచ్చని వెల్లడించింది. మద్దిలపాలెంలోని సిఎంఆర్ సెంట్రల్‌లో ఆ సంస్థ ప్రతినిధి కునాల్ మెహతా మాట్లాడుతూ, రూ. 2000 టోకెన్ మొత్తాన్ని చెల్లించి ప్రీరిజర్వ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తొలిసారిగా రోబోటిక్ కార్డియాక్ సర్జరీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మన దేశంలో తొలిసారిగా స్వదేశీ సర్జికల్ రోబోటిక్ టెక్నాలజీ డెవలపర్ ఎస్ ఎస్ ఇన్నోవేషన్స్ కేవలం రెండు రోజుల్లో రోబోటిక్ కార్డియాక్ టెలి సర్జరీలను విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ సీఈవో డాక్టర్ సుధీర్, శ్రీ వాస్తవ మీడియాకు తెలిపారు. మానవాళికి ప్రయోజనం చేకూర్చేలా శస్త్రచికిత్స సామర్థ్యాలను అభివృద్ధి చేసినందుకు తాము ఎంతగానో ఆనందిస్తున్నట్లు తెలిపారు. భౌగోళిక అవరోధాలతో సంబంధం లేకుండా వైద్య నిపుణుల అందుబాటులో అంతరాలను టెలీ సర్జరీల ద్వారా పూడ్చువచ్చని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వర వారి దేవస్థానంలో భోగి పండుగ సందర్భంగా సోమవారం గోదాదేవి కల్యాణం నేత్రపరంగా జరిగింది. ఆలయ మండపంలో శ్రీ గోదాదేవికి శ్రీ రంగనాయకకు అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘవాచారి, గొడవర్తి రామచంద్రాచార్యులు కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పట్టు వస్త్రాలు చీరలు,షాపులు అందజేశారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జివి.రమాభాయి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాత్రికేయులకు మిఠాయిలు

ప్రజాశక్తి -తగరపువలస : సంక్రాంతి సందర్భంగా స్థానిక విలేకర్లకు శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ యాజమాన్య ప్రతినిధి నాగరాజు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎల్.గణపతి రావు, కోశాధికారి ఎ.రోజా తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.242/2022 In O.S.1361/2009

Between:
MD. ASHRAF KHAN ...D.Hr
And:
Sri. J. Rama Krishna & others ...J.Drs

O XXI RULE-37 NOTICE

To,
JDR-1: Sri J Rama Krishna,
S/o. Father's name not known,
Hindu, aged about 51years,
D No.43-3-22, Rly. New Colony,
Visakhaptnam-16.

Take notice that the above named DHR has filed the above EP against you for recovery of the decree amount by sending you to civil prison. You are hereby summoned to appear in the above Court in person to answer why you should not be sent to the civil prison for execution of the above decree in the above EP on **06-02-2025** at **10.30 A.M.** In default of your appearance on that day the petition will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
ADAPA VENKATESWARA RAO,
Advocate
D No. 44-45-35,
Narendra Nagar,
Visakhapatnam-16

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
M.O.P. 449/2024

Between:
Mallepu Vara Lakshmi & 2 others ...Petitioners
And:
Pinnamaraju Sankara Vijaya Ramaraju & others ...Respondents

NOTICE

To,
R-2: Raja Sekharan Nair M.R.,
S/o. Shaskara Kurup M.N.,
R/at H.No.198, Sector-IV,
M.V.P. Colony,
Visakhapatnam-530017.

That, you are the 2nd Respondent in the above numbered MOP, which is filed by the petitioners against you and others, for grant of compensation of Rs.60,00,000/- for the death of Mallepu Mohan Nageswara Rao with subsequent interest from the date of filing of the MOP till the date of realization; and for costs of the petition.The above MOP stands posted on **04-02-2025** for your appearance. You are therefore hereby called upon to appear either in person or through a duly instructed counsel, before the Hon'ble Court on **04-02-2025** by **10:30 A.M.,** failing which the above MOP will be decided in your absence as ex-parte.

(By Order of the Hon'ble Court)
M.V. SIVA SARMA,
Advocate
Visakhapatnam.
Cell: 98486 66941.

IN THE HON'BLE COURT OF THE VIITH ADDL. DIST JUDGE AT VISAKHAPATNAM
Crl. A.M.U. 7/24 in Crl M.P. 10/24

Between:
P.Uma Maheswari ... Appellant / Petitioner
And:
B.Appala Reddy & Others ... Respondents / Respondents

NOTICE

R-1: Bora Appala Reddy
S/o. Adinarayana Reddy,
D.No. 9-13-52,
New Resavapalikanipalem,
Visakhapatnam.

పై నెంబరు Crl. MP 10/24 నందు R1 అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపించిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే: 27-1-2025** దీకి వాయిదా అయివున్నది. కావున **తే: 27-1-2025దీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వఖీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు Crl. MP మీ పరోక్షమందు తీర్మాణించడమగును.

(By Court Order)
A.V.SOMESWARA RAO
P.VIDYA SAGAR
Advocates
Visakhapatnam-530 020
Cell : 93955 53336, 98496 37555
Visakhapatnam.
Date : 13-1-2025

రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి

ప్రజాశక్తి-ములగాడ : జీవీఎంసీ 63వ వార్డు పారిశ్రామిక ప్రాంతానికి చెందిన కొట్నాన రవి ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రవి గతంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రెల్లి ఇంటెలెక్చువల్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా, పారిశ్రామిక ప్రాంత రెల్లి కులాల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా పని చేశారు. రవి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏపీటీఎఫ్ మండల పూర్వ అధ్యక్షులు పివి.సీతారామరాజు సోమవారం గుండెపోటుతో మండలంలోని మల్లవరంలో మతి చెందారు. ఆయన పార్థివ దేహానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమయాత్రలో ఏపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి వెంకటపతిరాజు, ప్రతినిధులు కెవి రమణ, ఆడారి దక్షిణామూర్తి, ఎంత్రినాథ్ స్వామి, గ్రామ సర్పంచ్ పి వాసురాజు, వైసిపి జిల్లా నాయకులు పిన్నమరాజు రవీంద్ర, మారిశెట్టి వెంకట అప్పారావు బొత్స వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, బల్లాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గవరల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో గవర జాతి సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం వుమెన్స్ కాలేజీలో సోదర సంక్షేమ సమితి సర్వసభ్య సమావేశంలో సురేంద్రతో పాటు సమితి అధ్యక్షులు కొణతాల రఘునాథ్, ఆలిండియా ఫుడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కొణతాల ముత్యాల భారతి, కేంద్ర గౌరి సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా సురేంద్రను, అనంతరం కాలువ చైర్మన్ బుద్ద తాతారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్, విల్లూరి హరి, భోగ లింగేశ్వర దేవస్థానం డైరెక్టర్ మల్ల సూరిబాబును సత్కరించారు. ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల పూర్ణ చంద్రరావు, పివి జగన్మోహన్, కాండ్రేగుల దాస్, కొణతాల రాజేంద్ర, కేఎమ్ నాయుడు, పాల్గొన్నారు.

భోగి మంటల్లో విఆర్ఎస్ సర్క్యులర్ దహనం


భోగి మంటల్లో విఆర్ఎస్ సర్క్యులర్‌ను దహనం చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగులను తగ్గించే ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన విఆర్ఎస్ సర్క్యులర్‌ను తక్షణమే యాజమాన్యం రద్దు చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద విఆర్ఎస్ సర్క్యులర్ ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం నాలుగు నెలలుగా ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. తక్షణమే ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని, విఆర్ఎస్ సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, పివి.రమణమూర్తి, జె.అయోధ్యరామ్, నాయకులు జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, కారు రమణ, యు.రామస్వామి, వైటి.దాస్, బి.అప్పారావు, వరసాల శ్రీనివాస్, మహాలక్ష్మి నాయుడు, బి.లక్ష్మణ రావు, డి.శ్రీనివాస్, పల్లా పెంటారావు, అట్టా అప్పారావు, తాండ్ర కనక రాజు, శ్రీనివాసరాజు, జి.ఆనంద్ పాల్గొన్నారు.

ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికునికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని రసూల్ డెక్కర్ ఫ్లే వుడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చేయి కోల్పోయిన షిఫ్ట్ ఆపరేటర్ ఎన్.పోలిరాజుకు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. రసూల్ డెక్కన్ ఫ్లేవుడ్ పరిశ్రమలో ఏ షిఫ్ట్ విధులు నిర్వహిస్తున్న పోలిరాజు ప్రమాదం జరగడంతో ఆయన చెయ్యి నుజ్జు అయిందని, వెంటనే ఆసుపత్రికి తరలించగా, అతని చేయి తొలగించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం వలన కార్మికులకు గాయాలయ్యాయని రాము విమర్శించారు. కార్మికుల భద్రత రక్షించడంలో విఫలం చెందుతున్న యాజమాన్యంపై లేబర్ అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమలో గాయపడి చెయ్యి కోల్పోయిన కార్మికుడు పోలిరాజుకు కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

లలిత కళలను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-ములగాడ : సంగీతం, సాహిత్యం, నృత్యం మొదలైన లలిత కళలను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పిజివిఆర్.నాయుడు (గణబాబు) అన్నారు. స్థానిక సింహాచలం బస్సు కాంప్లెక్స్ వద్ద గల వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ప్రతినిధి మరియప్పన్ శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గోదాదేవి నృత్య రూపకాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవి, నాట్య కళాకారులు శిరీష, అవినాష్, రాయప్రోలు రాధ, ప్రమీల, రోజారాణి, ఐఎంయుకు చెందిన డాక్టర్ బివి.రామలింగేశ్వరరావు, ఎర్రాజీ, కృష్ణమోహన్ ప్రసంగించారు. అనంతరం గోదాదేవి పాశురాలను, వీణ నాదాన్ని వినిపించారు. గోదాదేవి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. చిన్నారులకు గోదాదేవి వస్త్రధారణ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కర్రి స్వామి, శివకుమార్, విమల పాల్గొన్నారు.

సుగర్స్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సుగర్స్ కార్మికుల సమస్యలపై సోమవారం గోవాడలో కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీలోని పర్మినెంటు, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఓచర్ పేమెంట్, కార్మిక కుటుంబాలను పండగ పూటా కూడా పస్తులు ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వకుండా ఈరోజు, రేపు అంటూ 4 నెలలు నుండి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని కార్మికులకు బకాయి పడ్డ రూ.6 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్‌వి నాయుడు, చంద్ర శేఖర్, రాము, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి ప్రజ్ఞ స్కూల్లో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాలు, గంగిరెద్దులు, డూడూ బసవన్న, సన్నాయి మేళా తాళాలు, రంగ వల్లీలు, గొబ్బెమ్మలు, చక్కెర పొంగలి పిండి వంటలతో రంగోలి, భోగి మంటలు, గాలిపటాలు ఎగురవేయటం, తీన్మార్ డీజే వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజ్ఞ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మీ పద్మా, రాజ్యలక్ష్మీ, లలిత, పద్మజా, శ్రీదేవి పాల్గొన్నారు

కశింకోట : మండలంలోని భార్గవి స్కూల్లో సోమవారం సంక్రాతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పలు వేషాలతో అకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డి.రవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పుష్య మాసం 12వ పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై నుంచి ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయం వద్ద భోగిమంటలు వేశారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కర్రా బిల్లా పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని దేవరాపల్లిలోని శ్రీసన్యాసమ్మ ఆలయం ఆవరణలో స్థానిక యువకులు కర్రా బిల్లా పోటీలు నిర్వహించారు. ప్రతి ఏటా సంక్రాంతి మూడు రోజులు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి -రావికమతం : కోడిపందాలు నిర్వహి స్తున్న శిబిరంపై రావికమతం పోలీసులు సోమవారం దాడి చేసి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘువర్మ తెలిపారు. మండలంలో గుమ్మలపాడు గ్రామ సమీపంలో టేకు తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు కోళ్ళు, 850 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు

ఎస్.రాయవరం : మండలంలో పలు చోట్ల కోడిపందాలు, పేకాట శిబిరాలపై దాడి చేశామని ఎస్ ఐ విభూషణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిమ్మాపురం గ్రామ శివారులో కోడిపందా శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులపైనా, ఎస్ రాయవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపైనా కేసులు నమోదు చేసినట్టు అయన తెలిపారు.

కశింకోట : మండలంలోని ఉగ్గిని పాలెం గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్టు చేసామని సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బంది కోడిపందాల స్థావరంపై దాడి చేయగా రెండు కోడిపుంజులు, 1200 నగదు స్వాధీనం పట్టుబడినట్లు చెప్పారు. ఐదుగురు నిందితులను అరెస్ట చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై మనోజ్ కుమార్, రైటర్ సూర్యారావు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం టి. అర్జాపురం శివారు డోలవానిపాలెం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న సుమారు 31 మద్యం సీసాలను ఎస్‌బి సిబ్బంది సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కథనం మేరకు.. డోలవానిపాలెం గ్రామానికి చెందిన డోల కన్నారావు మద్యం అమ్ముతున్నట్లు ఎస్‌బి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం దాడి చేయగా సుమారు రూ 5 వేలు విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పేదలకు వస్త్రాలు వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక చినరాజుపేట శ్రీ సాంభశివ దేవాలయము ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, కొత్తూర్తి రామారావు, నందేల అప్పారావు, కుంచా చిన్ను, వేమన సంతోష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-వద్దాది : భోగి పండగ సందర్భంగా బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు వివిధ ఆకృతులలో రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ, పంచమ స్థానాలలో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు, పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ యల్లపు జగ్గారావు, మాజీ ఎంపిటిసి దొండా శ్రీను, ఉపసర్పంచ్ మొల్లి శ్రీను, తమరాన ముసలి నాయుడు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో కోలాటం

ప్రజాశక్తి-గాజువాక : లక్ష్మీ నరసింహ కోలాట టీం ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో భోగి సందర్భంగా సోమవారం కోలాటం నిర్వహించారు. స్థానిక సిపిఎం నాయకులతో పాటు, అక్కిరెడ్డి పాలెం యూత్ అసోసియేషన్ నాయకులు పాల్గొని కోలాటం ఆడారు. అనంతరం భోగి పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లోకేష్, కోలాటం సభ్యులు రవణమ్మ, మహేష్, కిరణ్, పద్మా లక్ష్మి పాల్గొన్నారు.


అక్కిరెడ్డిపాలెంలో కోలాటం ఆడుతున్న దృశ్యం

ఆనందాల సంక్రాంతి

◆ సంప్రదాయాలకు పెద్దపీట ◆ కనువిందు చేసే రంగవల్లులు
◆ అలరించే గాలిపటాలు, ఎడ్ల బండ్ల పందేలు



ప్రజాశక్తి-భీమునిపట్నం

కాంతులు తెచ్చే సంక్రాంతంటే ఎవరికి ఆనందం కలగదు ? పాడి పంట ఇంట చేరి, బంధుమిత్రులతో ఊరంతా కళకళలాడుతుంటే చూడాలని ఎవరికి అనిపించదు ? ఆటపాటలు, రంగవల్లులు, ఆకాశాన్నంటే గాలిపటాలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, నోరూరించే పిండి వంటలు... ఇవన్నీ సంక్రాంతికి ప్రతీకలు. ఇంతటి ఆనందాన్ని పంచే పెద్ద పండగకు ఉమ్మడి విశాఖ సిద్ధమైపోయింది.

తెలుగు వారి జీవితాల్లో విశేష ప్రాముఖ్యతను సంతరించుకున్న పండగల్లో సంక్రాంతి అతి ముఖ్యమైంది. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించే సందర్భంగా ఈ పండగను జరుపుకుంటారని పెద్దలు చెబుతారు. సంక్రాంతిని ఏ సందర్భంగా జరుపుకుంటారనే విషయమై రకరకాల కథలు, వాటి వెనక ఎన్నో నమ్మకాలు ఉన్నా గ్రామ సీమల సౌభాగ్యం వెల్లివిరిసే రీతిలో ఈ పండగ జరుగుతుంది. పండగ సమయానికి రైతుల కష్టార్జితమైన ధాన్యం ఇతర రకాల పంటలు ఇంటికి చేరుతాయి. పంటతో పాటే చేతినిండా డబ్బు కూడా ఉంటుంది. భూ స్వాములు, ధనిక రైతుల ఇళ్లల్లో పనిచేసే పాలేర్లకు ఈ పండగ నాడే ధాన్యం కొలుస్తారు. అంతేకాక గ్రామాల్లో రకరకాల చేతివృత్తులు చేసుకొని జీవించే వారికి కూడా ఆ సమయంలోనే ధాన్యం ఇస్తారు. ఈ రకంగా బీదా బిక్కి నుంచి అత్యంత సంపన్నుల వరకూ ఎవరైనా అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే ఏకైక పండగ సంక్రాంతి ఒక్కటే.

మూడు రోజుల పండగ

ఇది మూడు రోజుల పండగ. మొదటి రోజు భోగి జరుపుకుంటారు. తెల్లవారుజామునే వీధుల్లో పెద్ద పెద్ద మంటలు వేసి పాత వస్తువులను కాల్చి వేస్తారు. ఈ మంటల్లో ప్రతి ఒక్కరూ ఏదో ఒక పాత వస్తువును వేయడం ఆనవాయితీగా వస్తోంది. మంటల చుట్టూ చేరి పిల్లలు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. అందరూ తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరిస్తారు. తర్వాత పిండి వంటలతో భోజనాలు పూర్తవుతాయి. భోగి రోజు మూడు సంవత్సరాలలోపు వయస్సు పిల్లలకు భోగిపండ్లు పోస్తారు. రెండో రోజు సంక్రాంతి. ఆ రోజు 'నాస్తి' అనే శబ్దం ఉండరాదని, దానాలు చేయాలని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ రోజు పూజలు పెద్ద ఎత్తున జరుగుతాయి. చివరి రోజు పండగను కనుమ అంటారు. ఇది పూర్తిగా కర్షకుల పండగ. తమ శ్రమకు బాసటగా నిలిచిన పశువులను గజ్జల పట్టెళ్లతో సింగారించి ఊరేగిస్తారు. ఆడపిల్లల బొమ్మల కొలువులు అలరిస్తాయి. రకరకాల బొమ్మలు, దేవుడి విగ్రహాలను సేకరిస్తారు. కనుము నాడే రైతులు పోలి చల్లుతారు. ఆ రోజు వండే పొంగలికి పసుపు, కుంకుమ కలిపి పొలాల్లో వెదజల్లుతారు. దీనినే పోలి చల్లడం అంటారు. పొంగలి ఉడికేటప్పుడు, చల్లేటప్పుడు కూడా పోలి.. పోలి' అని కేకలు వేస్తారు. ఇది పూర్వపు రోజుల్లో అన్నానికి రక్తం కలిపి చల్లే పోలి మాదిరిగా ఉంటుంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటను ఇంటికి తీసుకుపోయేటప్పుడుగానీ, గ్రామ దేవతల పండగలు చేసినప్పుడుగానీ ఇలా పోలి చల్లడం కనిపిస్తూనే ఉంటుంది.

కలిమిలేముల తేడా లేదు

అన్ని వర్గాల ప్రజలూ ఉత్సాహంగా గడపడం సంక్రాంతి పండగ ప్రత్యేక విశిష్టత. పేదవారు, ఓ మాదిరి జీవనం గడిపేవారు, డబ్బున్నవారు, అత్యంత సంపన్నులు.. ఇలా అందరూ ఈ పండగను జరుపుకుంటారు. సంప్రదాయానికి పెద్దపీట వేస్తారు. అప్పు చేసైనా సరే సంక్రాంతిని జరిపే అలవాటు ఇప్పటికీ ఉంది. ఇళ్ల అలంకరణతో పండగ వాతావరణం ప్రారంభమవుతుంది. ఇళ్లకు వెల్ల, రకరకాల రంగులు వేయించడంతో పాటు ఎక్కువ మంది ఈ సంక్రాంతికి కొత్త వస్త్రాలు ధరిస్తారు. పిండివంటలు సంగతి సరేసరి. అత్తవారింట ఉన్న కూతురిని, అల్లుడిని పిలిచి వారితో కలిసి పండగ జరుపుకుంటారు. కొత్త అల్లుళ్లు ఉన్న వారింట్లో మరింత హడావుడి ఉంటుంది. విపరీతమైన చలిని కూడా లెక్క చేయకుండా బాలికలు, మహిళలు రంగు రంగుల ముగ్గులు వేస్తారు. అలాగే గొబ్బెమ్మలు అందంగా తయారు చేసి ప్రతి ఇంటి ముందు అలంకరిస్తారు.

అలరించే ఆటపాటలు

ఏ పండగకు జరగని రీతిలో ఆటల పోటీలు సంక్రాంతికి జరుగుతాయి. గ్రామాల్లో కోళ్ల పందేలు, ఎడ్ల బండ్ల పందేలు ముమ్మరంగా జరుగుతాయి. ఈ పోటీల్లో ఎక్కువగా పాల్గొనేది రైతు కుటుంబాల వారే. వీటిల్లో ఏ వయస్సు వారైనా సరే ఉత్సాహంగా పాల్గొంటారు. కోడి పందేలు మొదట్లో వినోదం కోసం ప్రారంభమైనా ఇప్పుడు అనేక చోట్ల జూదంగా మారాయి. అందుకే పోలీసులు దాడి చేసి నిర్వాహకులను అరెస్ట్‌లు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో ఎక్కువ భాగం రకరకాల పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుండగా మహిళా సంఘాల వారు ముగ్గుల పోటీలు పెడుతున్నారు.

నాడు- నేడు-ఎంతో తేడా

సంక్రాంతి పండగను నేడు రైతులు అనుకున్న స్థాయిలో జరుపు కోలేకపోతున్నారు. నూతన ఆర్థిక విధానాల ప్రభావంతో వారి పరిస్థితి రాన్రానూ దిగజారిపోతోంది. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసే దగ్గర మొదలైన రైతుల కష్టాలు పంట అమ్ముకునే వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. అతివృష్టి, అనావృష్టి రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పేదల ఇంట సంక్రాంతి హడావుడి కానరావడం లేదు. నగరంలో పెరిగిన అద్దెలు, నిత్యావసరాల ధరలు, జివిఎంసి భారాలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సంప్రదాయాన్ని కొనసాగి ంచాలనే తాపత్రయంలో అప్పోసప్పో చేసి పండగను జరుపుకుంటున్నారు.

తెలుగు లోగిళ్లలో పండగ వాతావరణం

సంక్రాంతి నెల రోజుల పండగ. వాడుక భాషలో సంక్రాంతి పండగను నెల పట్టటం అంటారు. ఇంటి ముందు ముగ్గులు, హరిదాసులు, బుడ బుక్కల వారు, గంగిరెద్దుల వాళ్లతో పండగ వాతావరణం ఉంటుంది. ఇంటి ముందు ఊడ్చి, కళ్లాపి చల్లి, రకరకాల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, పూలతో అలంకరించి పూజించడం ఆనవాయితీ. ఈసారి సంక్రాంతిని అందరం కలిసి జరుపుకుంటున్నాం.



ఎల్.రామలక్ష్మి, చిట్టివలస

పండగ పూట సంతోషం

ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటాయి. వ్యక్తిగత సమస్యలు, కుటుంబ సమస్యలు, ఇంకా అనేకానేక సమస్యలు ఉండనే ఉంటాయి. అయితే పండగలు, పబ్బాలు వచ్చేటప్పుడు సమస్యలు అన్నీ మర్చిపోతాం. ఇంటికి వచ్చే చుట్టాలు, స్నేహితులతో సరదాగా గడుపుతాం. అయితే నాటికీ, నేటికీ సంక్రాంతి సందడి కొంత తగ్గింది.

ఎల్.నళినీ కుమారి,
కొత్త పేట



స్వీటు షాపుల్లో..

సంక్రాంతి వంటకాలకు పెద్దపీట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని స్వీట్ దుకాణాల్లో ఇప్పుడు సంప్రదాయ వంటకాల జోరు కొనసాగుతోంది. పేద, ధనిక తారతమ్యం లేకుండా నగరవాసులు ఈ సంప్రదాయ పిండి వంటల కొనుగోలు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు.

నిజానికి ఇటువంటి పిండి వంటలు గతంలో ఇళ్ల వద్దనే మహిళలు ప్రత్యేకంగా తయారు చేసేవారు. ఇప్పుడు ఇళ్ల వద్ద ఇటువంటి పిండి పదార్థాలు తయారు చేసే సమయం, నైపుణ్యం మహిళలలో ఉండటం లేదు. దీనికి కారణం పని ఒత్తిళ్లు, బిజీ లైఫ్. అందువల్ల రెడీమేడ్ ఆహార పదార్థాల కొనుగోలు పట్ల ఎక్కువ మంది మక్కువ చూపిస్తున్నారు. అలా అని మహిళలు సంప్రదాయ పిండి వంటలను తయారు చేయటం లేదు అని చెప్పడం సరికాదు. విశాఖ వంటి పెద్ద నగరాలలో అన్ని ప్రాంతాలలో ఉన్న స్వీట్స్ దుకాణాలలో ప్రస్తుతం అమ్మకాల జరుగుతున్న పిండి వంటల తయారీలో ముఖ్య భూమిక మహిళలే అంటే ఆశ్చర్యం కలగకమానదు.

నగరంలోని కొద్ది స్వీట్స్ దుకాణాల వారు మినహా, పెద్ద పెద్ద దుకాణాలకు చెందినవారు సంప్రదాయ వంటకాలు తయారీలో ఆసక్తి చూపడం లేదు. దీనికి కారణం లేకపోలేదు. డిమాండ్‌ను బట్టి సంప్రదాయ వంటకాలను ఇతర ప్రాంతాల నుంచి నగరానికి రప్పించుకొని వాటిని అమ్మకాలు చేస్తున్నారు. కొత్తగా మార్కెట్‌కి ఎన్నిరకాల స్వీట్లు వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ సం ప్రదాయ పిండి వంటలదే పైచేయి. కరకరలాడే జంతికలు, నోటిలో కరిగిపోయే వెన్నప్పాలు, నమిలేకొద్దీ మాధుర్యాన్నిచ్చే పొంగడాలు, పంటికి పనిచెప్పే చక్కిడాలు, కరకరలతో నోటిని తీపిచేసే గజ్జికాయలు, నేతి ఘుమ ఘుమలతో నోరూరించే సున్నుండలు, మాధుర్యాన్నిచ్చే అరిసెలు, పోకుండలు, కమ్మగా కారంగా ఉండే కారంబూందీ.. రుచిలో వేటికి అవే సాటి. వీటి తయారీలో పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాలలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కొద్ది రోజులుగా పిండి వంటలను తయారు చేస్తున్నారు.

వీటన్నింటినీ సొంతానికి కాకుండా భారీ స్థాయిలో అమ్మకాలు జరిపేందుకు ఒక కుటీర పరిశ్రమ స్థాయిలో మహిళలు తయారు చేస్తూ, విశాఖ వంటి నగరాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం విశాఖ నగరంలో స్వీట్స్ దుకాణాలలో లభిస్తున్న సంక్రాంతి ప్రత్యేక పిండి వంటలు అధిక భాగం ఆ ప్రాంతం నుంచి రప్పించి అమ్ముతున్నవే కావడం విశేషం. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే సంక్రాంతి పండగ సందర్భంలో రూ.15 కోట్లకు పైగా పిండి వంటలు వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్క విశాఖ నగరంలోనే రూ.2 కోట్ల విలువైన పిండివంటల అమ్మకాలు స్వీట్స్ దుకాణాల ద్వారా జరుగుతున్నట్లు తెలిసింది.

ఇక స్వీట్స్ దుకాణాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పిండి పదార్థాలలో బూరెలు, పొంగడాలు, అరిసెలు, జంతికలు, గజ్జి కాయలు, సున్నుండలను చెప్పుకోవచ్చు. దుకాణాలలో బూరెలు కిలో రూ.280, పొంగడాలు కిలో రూ.300, అరిసెలు కిలో రూ.280, బెల్లంతో తయారు చేసిన అరిసెలు రూ.320, గజ్జి కాయలు రూ.250, పాకుండలు రూ.250, సున్నుండలు కిలో రూ.400, సున్నుండలు బెల్లంతో తయారు చేసినవి రూ.440 చొప్పున అమ్ముతున్నారు. జంతికలు కిలో రూ.250 ధర ఉంది. ధరలు చూసి కొంతమంది వినియోగదారులు ఆశ్చర్య పడుతున్నా, సంక్రాంతి పండగ కావడంతో ముక్కుతూ మూలుగుతూ కొనుగోలు చేస్తున్నారు. కొందరైతే అన్ని ధరలు పెరిగాయి, ఇవి మాత్రం పెరగవా...? అంటూ సమాధాయించుకొని కొనుగోలు చేస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పిండి వంటలు

బెల్లం తయారీ వైపే రైతన్నల ఆసక్తి!

- సుగర్స్ నిర్వాకంతో ప్రత్యామ్నాయం వైపు చెరుకు రైతులు
- ఫ్యాక్టరీ కంటే బెల్లం క్రషర్లకు చెరుకు తరలింపు
- సంక్రాంతి పండగ కావడంతో జోరుగా బెల్లం విక్రయాలు



చెరుకు క్రషింగ్ చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాలలో రైతులు బెల్లం తయారీ ప్రారంభించారు. వడ్డాది, విజయరామరాజుపేట కుమంధాన్నపేట, రాజాం తదితర గ్రామాల్లో వారం రోజులుగా బెల్లాన్ని తయారు చేస్తున్నారు. గతంలో 10- 12 కేజీల బెల్లంను దిమ్మలుగా తయారు చేసి అనకాపల్లి మార్కెటుకు తరలించి అమ్మకాలు చేసేవారు. అయితే ప్రస్తుతం పెద్దదిమ్మలు తయారీ నుండి రైతులు స్థానికంగా అమ్మకాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాను. దీంతో కిలో సైజులో బెల్లం దిమ్మలు తయారుచేసి ఎక్కడికక్కడే అమ్మకాలు చేస్తున్నారు. చెరకు క్రషర్‌ల ద్వారా గానుగాడి, రసం తీసి బెల్లంగా తయారు చేస్తున్నారు.

సుగర్స్ క్రషింగ్‌లో జాప్యంతో బెల్లం తయారీపై ఆసక్తి

మండలంలో పలు గ్రామాల్లో రైతులు గతంలో గోవాడ చక్కెర కర్మాగారానికి చెరకును తరలిస్తూ ఉండేవారు. ఈ ఏడాది గోవాడ చక్కెర కర్మాగారం క్రషింగ్ ఇంకా ప్రారంభించకపోవడంతో, బెల్లం తయారీవైపు రైతులు మక్కువ చూపుతున్నారు. కోతకు వచ్చిన చెరకును సకాలంలో కటింగ్ చేయకపోతే, దా ని



బెల్లం తయారీకి సిద్ధం చేసిన చెరుకు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన చిన్న బెల్లం దిమ్మలు

నుంచి బెల్లం, పంచదార దిగుబడి తగ్గడంతోపాటు బరువు పరంగానూ తగ్గే సూచనలు ఉండడంతో దీని వల్ల రైతులకు అనివార్యంగా నష్టం వాటిల్లే పరిస్థితి ఉండడంతో పలువురు రైతులు చెరుకును గానుగులకు తరలించి, బెల్లం తయారీ, అమ్మకాలపై దృష్టిసారిస్తున్నారు.

చెరకు డబ్బుల చెల్లింపుల్లో జాప్యమూ ఒక కారణమే?

గోవాడ చక్కెర కర్మాగారం యాజమాన్యం సకాలంలో రైతులకు నగదు చెల్లించకపోవడంతో ఒక్కొక్క టన్ను చెరకును బెల్లం తయారీ దారులకు రూ.2600 అమ్మకాలు చేస్తున్నారు. అవసరానికి చెరకు డబ్బులు అందని పరిస్థితులు ఉండడంతోపాటు మరోవైపు ర క్రషర్ యజమానులు చెరకు సరఫరా చేసిన వెంటనే నగదు చెల్లిస్తుండడంతో బెల్లం తయారీ క్రషర్ల వైపు ఆసక్తి చూస్తున్నాను.

లాభదాయకంగా చిన్న దిమ్మలు తయారీ

బెల్లం తయారీలో చిన్న బెల్లం దిమ్మలు తయారీ తయారీదారులకు లాభాలను ఇస్తున్నాయి. కిలో దిమ్మ రూ.50లకు పైబడి అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ కావడంతో పండుగకు ఇంటింటా పిండి వంటకాలు తయారుచేసే పరిస్థితి ఉండడంతో, ఈ వ్యాపారం లాభసాటిగానే ఉంది. తాజాగా తయారైన బెల్లం దిమ్మలు అందుబాటులో ఉండడంతో ప్రజలు సైతం వీటిని కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రోడ్లకు ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేసుకొని అమ్మకాలు చేస్తున్నారు. వినియోగదారుల సైతం దిమ్మల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్ కావడంతో వడ్డాది, చోడవరం మధ్య బెల్లం దిమ్మల అమ్మకాలు ముమ్మరంగా సాగుతున్నాయి

నత్తనడకన పైప్‌లైన్ పనులు

వాహనదారుల ఇక్కట్లు



రోడ్డు మధ్యలో తవ్వి సరిగా పూడ్చకపోవడంతో తేలిన రాళ్లు


ప్రజాశక్తి -ములగాడ : పైపులైన్ పనుల్లో నిర్లక్ష్యం పాదచారులు, వాహనదారుల పాలిట శాపంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి, కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపం, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల అంతిమంగా అవి సక్రమంగా పూర్తికాని పరిస్థితి నెలకొంటోంది. అభివృద్ధి పనులు, సౌకర్యాల కల్పన పేరుతో ఏడాది పొడుగునా ఎక్కడో ఒకచోట ఇలాంటి పనులు జరుగుతుండగా, ఎక్కడా సజావుగా సాగని పరిస్థితి ఉందనే చెప్పాలి.

పారిశ్రామిక ప్రాంతంలో జింక్ గేటు ప్రాంతం నుంచి సింధియా వెళ్లే మార్గంలో మంచినీటి పైపులైను కోసం రోడ్లను తవ్వి, అందులో పైపులైన్లను అమర్చి, తర్వాత ఆ గుంతలను మట్టితో పూడ్చారు. మట్టితో పైపైనే పూడ్చటం, ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో, రద్దీ వల్ల మట్టితో కప్పిన పైపులైన్ల గోతుల్లోంచి రాళ్లు బయటకు రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పైపులైన్లు వేసేందుకు గోతులు తవ్వేటప్పుడు ఉన్నంత శ్రద్ధ, వాటిని పూడ్చడం లేకపోవడం వల్లే ప్రజలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉత్పన్నమౌతోంది.

ఈ పైపు లైను పనులను సుమారు రూ.3 కోట్లతో చేపట్టారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని ప్రకటించారు. రూ.60 లక్షలతో అచ్చులు నాయుడులోవలో రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయ్యేసరికి ఏడాది కావచ్చని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

రేపు బొజ్జన్న తీర్థం, బౌద్ధ మేళా

- వివిధ ప్రాంతాల నుంచి రానున్న బౌద్ధ భిక్షువులు
- ఉత్సాహంగా పాల్గొననున్న పర్యాటకులు, స్థానికులు




బొజ్జన్న కొండ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్రలో పేరుగాంచిన ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్నకొండ (బుద్ధుని కొండ) తీర్థం బుధవారం అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రతిఏటా కనుమ రోజు నిర్వహించే ఈ తీర్థానికి ప్రత్యేక విశిష్టతలు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో ఈ తీర్థానికి తరలివస్తారు. రంగురంగుల పంచదార చిలకలు, వివిధ రంగుల రాట్నాలు, గాలిపటాల పోటీలు జరుగుతూ ఉంటాయి. పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణం , పచ్చని పొలాలు కావడంతో సందర్శకులు లింగాల కొండ, బుద్ధుని కొండలపై వెళ్లి ఆస్వాదిస్తారు.

కనుమ రోజున ఆనవాయితీగా బౌద్ధ మేళా

కనుమ రోజున ప్రతి ఏటలాగే ఈ ఏడాది జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బౌద్ధ మేళా నిర్వహిస్తున్నారు. ఈబౌద్ధమేళాలో దేశవిదేశాల నుంచి ప్రసిద్ధ బౌద్ధ బిక్షువులు పాల్గొని, ప్రధాన గుహలో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బౌద్ధ ప్రవచనాలు, బుద్ధుని శాంతి అహింస ధర్మ మార్గాలను గురించి వక్తలు వివరిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారు.



బొజ్జన్న కొండకు వెళ్లే మార్గంలో నిర్మించిన ఆర్చి

బొజ్జన్న కొండను టూరిజం ప్యాకేజీలో చేర్చాలి



ఉత్తరాంధ్రకే మణి మకుటంగా ఉన్న బొజ్జన్న కొండ అభివృద్ధికి ఇప్పటికే చాలా వరకు చర్యలు తీసుకున్నారు. అయితే ఇక్కడ ఏర్పాటుచేసిన లేజర్ థియేటర్ షో, లైటింగ్ సిస్టం, సౌండ్ సిస్టం, పార్కింగ్ స్థలం, ఫుడ్ కోర్టు పూర్తిస్థాయిలో పర్యాటకులకు అందుబాటులోకి తేవాలి. ప్రశాంతంగా ఉన్న ఇక్కడి వాతావరణంలో ఈ మార్గంలో భారీ క్వారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి. దీనికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ కృష్ణన్ కృషి చేయాలి. అలాగే బొజ్జన్న కొండను ఉమ్మడి విశాఖ బౌద్ధ టూరిజం ప్యాకేజీ లో భాగంగా చేర్చాలి. అప్పుడే బొజ్జన్న కొండ మరింత ప్రాచుర్యాన్ని పొందుతుంది.

- బల్ల నాగభూషణం, ప్రచార కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య

వినియోగంలోకి రాని సౌకర్యాలు..

బొజ్జన్న కొండ అభివృద్ధికి మాజీ ఎంపీ డాక్టర్ బివి సత్యవతి విశేష కృషి చేసారని చెప్పవచ్చు. ఇండోనేషియా టెక్నాలజీతో బుద్ధుని చరిత్ర తెలిపే లేజర్ స్క్రీనింగ్ షో, సౌండ్ సిస్టం, సిసి కెమెరాల ఏర్పాటు, ఫుడ్ పార్కు, రెండు ఎకరాలలో ప్రభుత్వ నిధులతో పార్కింగ్ స్థలం ఏర్పాటుకు కృషి చేశారు. దీనికి రూ.15.50 కోట్లను వెచ్చించారు. వీటిని పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అలాగే స్థానిక పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఇతర శాసనసభ్యులు అధికారులతో లేజర్ స్క్రీనింగ్ లైటింగ్ షో, సౌండ్ సిస్టం ప్రారంభించారు. అయితే వీటిని ప్రతిరోజు ప్రదర్శించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం అనివార్య కారణాల వల్ల ఆగిపోయింది. అలాగే టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన హరిత రెస్టారెంట్ కూడా పనిచేయలేదు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన వాటిని ఎందుకు వినియోగించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రతి ఏటా కనుమ రోజు ఏర్పాటు చేసే బౌద్ధమేళా, బొజ్జన్న తీర్థం చూసేందుకు వేలాదిమంది జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వస్తుంటారు. వాహన పార్కింగ్ లేక సుమారు రెండు మూడు కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన పర్యటకులు బొజ్జన్న తీర్థం చూసేందుకు రావలసి వస్తోంది.

చదరంగం పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి చదరంగం పోటీలను సోమవారం ప్రారంభించారు. పోటీలలో మండలంలో పలు గ్రామాలకు చెందిన చదరంగా క్రీడాకారులు హాజరై వారి ప్రతిభను కనబరిచారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆడారి శివ అప్పలనాయుడు, ఎం నాగేశ్వరరావు, పోలార్పు శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-గాజువాక : జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ దుగ్గపువానిపాలెం గ్రామంలో 735 దానపతల్లి అమ్మవారి చీరలను పేద మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గపు వెంకట అప్పారావు, ప్రగడ అప్పల నరసింహులు, బొడ్డ సన్యాసిరావు, సరళన రమణ. ప్రగడ శ్రీను, దుగ్గపు దానప్పలు, గోనప సన్యాసినాయుడు, అప్పిని సన్యాసిరావు, దాకా కొండలరావు, దుగ్గపు నరసింహమూర్తి, దుగ్గపు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ స్వామి, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సోమవారం భోగి పండుగ సందర్భంగా ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించారు. టిడిపి 80వ వార్డు అధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి భోగిమంట వేశారు. కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు పెంటకోట చంద్రరావు, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్, తురకలపూడి హేమ, మండలి సభ్యులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : భోగి పండుగ సందర్భంగా మండలంలోని మేడిచర్ల గ్రామంలో కేశవ స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణం కన్నులు పండుగగా జరిగింది. తెల్లవారుజామున పల్లకి సేవలో భక్తులందరూ భక్తి పాటలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు తాత వెంకటరమణమూర్తి శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావులమ్మపాలెం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ఎమ్‌డి చొక్కాకుల వెంకట్రావు ఆర్థిక సహాయంతో సంక్రాంతి విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం చొక్కాకుల వెంకటరావు, గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ మూడు రోజులు నిర్వహిస్తామని, ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు, షీల్డ్ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిణి షిప్పింగ్ ఎమ్‌డి చొక్కాకుల అనిల్, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, పిఎసిఎస్ కార్యదర్శి గోంప రమణ, రెడ్డి వాసుదేవరావు, గొప్ప ముత్యాల నాయుడు (హైటెక్ మేస్త్రి), బోకం జగదీష్, మేడపురెడ్డి జగన్నాథం, గొంప దేముడుబాబు, సబ్బవరపు శ్రీనివాసరావు, పల్లా రమణ, చీపురుపల్లి నాయుడు, రొంగలి దేముడు బాబు, చొక్కాకుల యూత్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

14న జిల్లాస్థాయి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14 సంక్రాంతి రోజున జిల్లాస్థాయి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేశ్ నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు సంక్రాంతి సంబరాలు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గుర్రపు పందాలు, ముగ్గులు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భాస్కరరావు చెప్పారు. గెలుపొందిన విద్యార్థులకు భారీ నగదు బహుమతులు అందించనున్నారు.



సమావేశంలో పాల్గొన్న సురేష్‌నాయుడు, భాస్కరరావు

ఘనంగా భోగి పండగ





నర్సీపట్నంలో భోగి మంటను వెలిగిస్తున్న స్పీకర్ అయ్యన్న, నక్కపల్లిలో గంగిరెద్దు శీర్వచనం తీసుకుంటున్న మంత్రి అనిత

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన నివాసంలో కుటుంబ సమేతంగా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన సతీమణి చింతకాయల పద్మావతి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, డాక్టర్ సువర్ణ విజయ్, చింతకాయల రాజేష్, దివ్యశ్రీ తదితరులు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నక్కపల్లి : నియోజకవర్గ ప్రజలతో కలిసి సంక్రాంతి పండగ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని సారిపల్లిపాలెం లో ఆమె స్వగృహంలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భోగి మంటలు, గంగిరెద్దు ఆటలు, హరిదాసు పాటలు, రంగువల్లులు, కోలాటాలు, సంప్రదాయ వంటకాల ప్రదర్శనతో నిర్వహించిన సంబరాలు అలరించాయి. సంప్రదాయ వంటకాల ప్రదర్శనను అనిత తిలకించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను మంత్రి అనిత అందజేశారు. కేరళా నృత్యం, కోలాటాలు, తప్పెటగుళ్ళు ప్రత్యేక ఆకర్షనీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉపమాకలో వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు భోగి మంటను వెలిగించారు.

నర్సీపట్నం టౌన్ : మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఇంట వద్ద భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన క్యాంపు కార్యాలయం ముందు భోగి మంటలు వేసి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలోని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటలను వేశారు. గంగిరెద్దులు హరిదాసులు పలు వేషధారణలో అలరించారు. పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యాన భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ వంశీకృష్ణ శ్రీనివాస్ భోగి శుభాకాంక్షలు తెలిపారు.

అనకాపల్లి : అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గం పార్టీ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ ఆధ్వర్యంలో ఘనంగా భోగి సంబరాలు జరిగాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు బిఎస్ ఎంకె జోగినాయుడు, గొల్ల బాబు, చదరం నాగేశ్వరరావు, దూలం గోపి పాల్గొన్నారు.

తుమ్మపాల సుగర్స్‌లో ఆగని దొంగతనాలు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇప్పటికే లిక్విడేషన్ దిశగా వెళ్తున్న తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన ఆస్తులు గత నాలుగేళ్లుగా దొంగతనాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. అయితే అధికారులు చోద్యం చూస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆదివారం రాత్రి ఫ్యాక్టరీలో కొన్ని యంత్రాలను దొంగిలించి తీసుకెళ్తున్న నిందితున్ని రైతులు పట్టుకున్నారు. గతంలో ఫ్యాక్టరీ లిక్విడేటర్ పివిఎస్ శాస్త్రి ఫ్యాక్టరీని లిక్విటేషన్‌కు ప్రయత్నించగా అప్పట్లో జనసేన, తెలుగుదేశం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించి హైకోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. దీంతో అప్పటి లిక్విడేటర్, ప్రస్తుత ఇంచార్జ్ ఎమ్‌డి పివిఎస్ శాస్త్రి తెరచాటున ఫ్యాక్టరీని అమ్మే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు స్టే తొలగించేందుకు కూడా శాస్త్రి ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్యాక్టరీలో దొంగతనాలు జరుగుతుంటే రైతులు దొంగలను పట్టుకోవడం, పోలీసులకు అప్పగిస్తుంటే ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం వారిని విడిపించే ప్రయత్నాలు చేయడం వెనక మర్మం ఏమిటో తెలియలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు లిక్విడేషన్ వద్దన్న నాయకులు, నేడు దొడ్డిదారిన ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రస్తుత ఎమ్‌డిని కీలక వ్యక్తిగా భావించడం పట్ల రైతులు తీవ్రంగా మనోవేదనకు గురవుతున్నారు. ఫ్యాక్టరీ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్లి మోది నాయుడు పలుమార్లు ఎండి అనైతిక వ్యవహారాల పట్ల ఫిర్యాదులు చేయడం, 51 విచారణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యం, కూటమి నాయకులు స్పందించి రైతులకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మైనర్‌పై అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాకలో మైనర్ బాలిక అత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఏటికొప్పాక వెళ్లి బాధిత బాలిక బంధువాలను పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక, ఆమె తల్లిదండ్రులు కెజిహెచ్‌లోనే ఉన్నారని, బాధితులకు తగిన పరిహారం ప్రభుత్వం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అత్యాచారం చేసిన నిందితుడైన 14 ఏళ్ల బాలుడు తరచూ పోర్న్ వీడియోలు చూసే అలవాటు ఉందని తెలుస్తోందన్నారు. నేరానికి పాల్పడ్డ బాలుడు మంచి పరివర్తన చెందే విధంగా శిక్షలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ మంగ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామకృష్ణ, రైతు సంఘం నాయకులు నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబికా తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జంపపాలెం - సోమలింగపాలెం గ్రామల మధ్యలో వెలసిన శ్రీనూకాంబికా అమ్మవారి తీర్థమహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గుర్రం పరుగు పందేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పరుగు పందేలను ఎంపీ సిఎం రమేశ్ ప్రారంభించారు. 17 గుర్రాలు పోటీ పడ్డాయి. ఈ సందర్భంగాభారీ అన్నసంతర్పణ నిర్వహించారు. తప్పెట గుళ్ళ, తోడపెద్దు ఆట, మహిళల కోలాటం వీక్షకులను ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొలమరశెట్టి వెంకట్ దంపతులు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, టిడిపి నేత దాడి రత్నాకర్, సర్పంచ్ శిలపరశెట్టి దేవకీనాయుడు, మాజీ సర్పంచ్ యల్లపు శ్రీరాములు, పెద్దలు పాల్గొన్నారు.

'ఎన్‌టిఆర్ జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి'

ప్రజాశక్తి-కశింకోట

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తీడ గ్రామంలో ఎన్టీఆర్ తీర్థం మహోత్సవం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న కొణతాల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు, భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షులు కాయలు మురళి, సిదిరెడ్డి శ్రీను, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

భోజన షెడ్డు నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -మునగపాక

స్థానిక పెద్ద మద్దుం సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో భోజన షెడ్డు నిర్మాణానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ రూ.80 వేలు విరాళం సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మొల్లేటి సత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చం నాయుడు, పెంటకోట ఉమేష్, కాంద్రేగుల జగ్గారావు, వేగి వీరి నాయుడు, పెంటకోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కష్టించి పనిచేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

అనుకున్న లక్ష్యాలకు చేరుకోవడానికి కష్టించి పని చేయాలని సత్య సాయి సేవ సంస్థల జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జక్కాను సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కింతాడ శివారు కూాంద్రపువానిపాలెం సత్యసాయి రామాలయంలో యువ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. కార్యక్రమంలో సేవా సంస్థల మండల ఇన్చార్జి కన్నూరు అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌సిల వర్గీకరణ సరికాదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎస్‌సిల వర్గీకరణ చేయడం సరికాదని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసన్యాసమ్మ ఆలయం ఆవరణలో ఆదివారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగంగా ఎస్సీలను విభజించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కార్లి సాయి సుందరరావు, మచ్చ వీర్రాజు, తాడి అప్పారావు, పరవాడ అప్పారావు, మచ్చ రామారావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం నిదానం దొడ్డి వద్ద సోమవారం కీర్తిశేషులు బుద్ధ చిన్న సూర్యనారాయణ జ్ఞాపకార్థం (మ్యాంగో ఎక్స్పోర్ట్ ప్రొప్రైటర్) సోమవారం పేదలకు దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బుద్ధ రాజేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సంగా భోగి సందర్భంగా తమ తండ్రి స్నేహితులు లంకెలపల్లి సూర్యనారాయణ చేతుల మీదగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుటుంబీకులు బుద్ధ త్రిష, బుద్ధ శ్రీను, బుద్ధ వెంకట్రావు, పీలా హరి, మద్దాల శ్రీను, మద్దాల కిషోర్, దొడ్డి రవి, మిత్ర బృందం పాల్గొన్నారు.

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ పరిధి అన్నవరం వెంకయ్యగారి పేటలో గతంలో ఇచ్చిన హామీ ప్రకారం మూడు సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కండిపిల్లి రోడ్డు నుండి సాయిబాబా గుడి వరకు, దుర్గలమ్మ గుడి దగ్గర నుండి మల్లెల తల్లి గుడి వరకు మూడోది సియాద్ర అప్పారావు ఇంటి దగ్గర నుండి బంటుముత్యం ఇంటి వరకు రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి ఎర్రం శెట్టి చిన్న, స్థానిక టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

-సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



అనకాపల్లిలో దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం విద్యుత్తు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.16 వేల కోట్ల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

ప్రజాశక్తి -నక్కపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రాజయ్యపేట గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాజయ్య పేట గ్రామ శాఖ కార్యదర్శి ఎం.మహేష్ బాబు మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రతిపక్షంగా ఉన్నప్పుడు గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టిందని, అధికారంలోకొస్తే భవిష్యత్తులో పెంచబోమని వాగ్దానం చేసిందన్నారు. ఆ వాగ్దానాన్ని తుంగలోకి తొక్కి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూ ఆఫ్ చార్జీలు పేరిట ప్రజలపై విద్యుత్ భారం వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.బాపూజీ, సి.హెచ్.రాజు, బంగార్రాజు, కాశీరావు, స్వామి, భోగమ్మ, లక్ష్మి, దేవి పాల్గొన్నారు.

చీడికాడ: మండల కేంద్రంలో చావిడి వద్ద భోగి మంటల్లో సిపిఎం నేతలు విద్యుత్ బిల్లులను ధగ్ధం చేసారు.సిపిఎం మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపుతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. దొంగ చాటున స్మార్ట్ మీటర్ల బిగి స్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లను తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసి ఆ తర్వాత గృహాల్లో ఏర్పాటుకు పూను కుంటున్నారని తెలిపారు.

ఎస్ రాయవరం: మండలంలో పి.ధర్మవరం గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, ఎస్.భాస్కర్, ఎస్.రమణ, ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని నాగపురం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో కాల్చి వేశారు. . సిపిఎం మండల నాయకులు కే.కన్నబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదన్నారు. తక్షణమే వీటిని తగ్గించాలన్నారు.

అనకాపల్లి : పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం భోగి మంటల్లో బిల్లులు తగలబెట్టి నిరసన తెలియజేశారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రెల్లి వీధి, విజయరామ రాజు పేట, ఉప్పల వీధి, నెయ్యిల వీధి, గవర పాలెం పార్క్ సెంటర్ తదితర ప్రాంతాలలో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వర రావు, అల్లు రాజు, పౌర సంక్షేమ సంఘం నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్య బాబు, బి నూక అప్పారావు, పలక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో...

మునగపాక : ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యాన ఆ గ్రామంలో సోమవారం విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ని సాయి, కడియం సూరి గోవిందరావు, సుందరపు కృష్ణ, అప్పారావు, చిన్ని కృష్ణ, సుందరపు ఈశ్వరరావు, బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : కూటమి ప్రభుత్వం అధికారంలో కొస్తే కరెంటు చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి నేడు ప్రజలపై ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు పేరుతో రూ.17 వేల కోట్లు ప్రజలపై భారాలు వేయడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో చోడవరం విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఎస్వి నాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని పాత గొర్లివాని పాలెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు అనకాపల్లి నాగేశ్వరరావు, ఏ నాని, ఏ బాబురావు, ఎస్.అబ్బులు, తంగేటి అప్పారావు, డెక్క దేముడు, కంఠంశెట్టి బేబీ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ కసింకోటలో సోమవారం విద్యుత్ బిల్లులను భోగి మంటలో దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి వరలక్ష్మి, ఝాన్సీ సరిత అప్పారావు జగన్ పాల్గొన్నారు.



ఆరిలోవలో...

కె.కోటపాడు : మండలంలోని పోతనవలస, ఆర్వై అగ్రహారం, వారాడ, ఆనందపురం, సూరెడ్డిపాలెం గొండుపాలెం గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యాన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమాల్లో సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, నాయకులు ఎర్ర దేవుడు, వనం సూర్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని మండలంలోని అచ్యుతాపురం, తిమ్మరాజుపేట గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యాన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కర్రి అప్పారావు, ఎస్ రాము నాయుడు, నడుపూరి సన్యాసిరావు, దూళి వెంక నాయుడు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలు తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్రకుమార్ డిమాండ్ చేసారు. తోటగరువు, బిఎన్ఆర్ నగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరంద్రకుమార్ మాట్లాడుతూ,గతంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు బాదుడే బాదుడు అనే కార్యక్రమాలు చేపట్టి ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. విద్యుత్ భారాలను, స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.నాగరాజు, జి.నాగరాజు, జి.లక్ష్మీనారాయణ, సిహెచ్ రాము, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.



కంచరపాలెంలో..

సీతమ్మధార: ఏఎస్ఆర్ నగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు మాట్లాడుతూ, విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం జోన్ నాయకులు అప్పలరాజు, గౌరీ, ఏఎస్ఆర్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 1386 రోజులుగా జరుగుతున్న స్టీల్ పరిరక్షణ ఉద్యమ దీక్షా శిబిరం వద్ద భోగిమంట వేసి విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. అనంతరం సిఐటియు నాయకులు, కార్యకర్తలు శిబిరంలో కూర్చొని దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు పూర్వ జిల్లా కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు పెట్టబోమని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు రెండింతలు భారం వేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అదానితో చేసుకున్న సౌర విద్యుత్, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, ఒమ్మి అప్పారావు, వై.రాజు, ఎన్.ప్రకాశరావు, జివిఎన్.చలపతి, కెవిపి చంద్రమౌళి, పి.వెంకటరావు, కె.కుమారి, కుమారమంగళం తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : కంచరపాలెం ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ సెక్రటరీ బొట్టా ఈశ్వరమ్మ, ఎస్.సోమేశ్వరరావు, కుమారి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

మధురవాడ : కొమ్మాది విలేజి, పరదేశి పాలెం, మారికవలస, పోర్టుకాలనీ ప్రాంతాలలో సిపిఎం మధురవాడ ప్రాంత నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల నమూనాలు వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పి.రాజుకుమార్, బి.భారతి, పవన్, డి.కొండమ్మ, సియాద్రి పైడితల్లి, ఎస్.పైడిరాజు, బంగారి, సాధూరావు, బి.పైడియ్య, ఎస్.పోలరాజు పాల్గొన్నారు.

గాజువాక : ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం రామాలయం దగ్గర భోగిమంటలో కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుబ్బన్న, దాసరి అప్పారావు, కోటేశ్వరరావు, శ్రీలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాజువాక : ట్రూ ఆఫ్ చార్జీలను, విశాఖ స్టీల్ ప్లాంట్ విఆర్ఎస్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో షీలా నగర్‌లో సోమవారం ఉదయం భోగిమంటల్లో కరెంట్ బిల్లులు, సర్క్యులర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై సత్యవతి, సిఐటియు నాయకులు రాజేష్ నాయుడు, నాగేష్, ఈశ్వరరావు, శరత్ చంద్ర, స్థానిక కమిటీ సభ్యులు గీత, శ్రీదేవి, పి మని, సీతా పాల్గొన్నారు.



నక్కపల్లిలో..



విజేతకు బహుమతి ఇస్తున్న ఎమ్మెల్యే గణబాబు

పలుచోట్ల ముగ్గులు, వంటల పోటీలు

ప్రజాశక్తి -గోపాలపట్నం: ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు ఇంటి వద్ద బి.ఆర్.టి.ఎస్ సెంటర్ రోడ్డు వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల, వంటలు పోటీలు నిర్వహించారు.వీటిని గణబాబు కుటుంబ సభ్యులతో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలతో సంక్రాంతి సంబరాలు జరుపు కోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాకానినగర్‌కు చెందిన కె.అనంతలక్ష్మి వంటల పోటీల్లో విజేతగా నిలిచారు. ఎమ్మెల్యే ఆమెకు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 89 వార్డ్ కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, జనసేన నాయకురాలు ప్రశాంతి, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపట్నం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, డివైఎఫ్ ఆధ్వర్యంలో గోపాలపట్నంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆర్య ప్లే స్కూల్ ఆర్థిక సాయంతో బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఐద్వా జోన్ కమిటీ సభ్యురాలు బి సరోజిని, డివైఎఫ్ నాయకుడు నితిన్ ఈ ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవర జ్యోతి పాల్గొన్నారు.

మాధవధార : మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు మాధవధార రామాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేడాడ రమణి కుమారి, తమ్మినేని పద్మజ, తమ్మినేని లోహితరావు, సనపల రామ్‌గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోని వల్సంపేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని మండల జనసేన పార్టీ నాయకులు ప్రగడ కృష్ణబాబు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. మహిళలు సుమారు 230 మంది పాల్గొన్నారు.నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ రాజాన సూర్యచంద్ర పాలొని కృష్ణబాబుని అభినందించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగా కృష్ణారావు, నాయకులు యడ్ల శివ. కే.వరహాలబాబు, చిన్న, మల్లాది శ్రీను పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం గోదారంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవంలో భాగంగా స్వామివారి పుష్ప తోటలో ఆలయ అర్చకులు కల్యాణం వైభవంగా నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరు వీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి : 94 వ వార్డు పరిధి రవి నగర్ శేషాద్రి కొండపై వెలసిన కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసంలో ప్రారంభమైన పూజలు సోమవారం భోగితో ముగిశాయి. ఉదయం నుండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ ప్రాంగణంలో గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా వేదపండితుల సమక్షంలో నిర్వహించారు భారీ అన్న సమారాధన చేపట్టారు .ప్రతి ఏడాది ఈ కళ్యాణం ధనుర్మాస పూజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ స్వామి తెలిపారు.

రహదారిపై అడవి దున్నలు సంచారం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు కళ్యాణపులోవ జలాశయం అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి మూడు అడవి దున్నలు ప్రత్యక్షమయ్యాయి. కల్యాణపు లోవ- రొచ్చు పనుకు రహదారిలో జలాశయం శివారు రహదారి పై అడ్డంగా ఈ అడవి దున్నలు ఉన్నాయి. రాత్రి 8 గంటల సమయంలో అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ పాంగి నూకరాజు తన సెల్ ఫోన్ లో చిత్రీకరించాడు. సుమారు గంట పాటు రహదారికి అడ్డంగా ఉండి పోవడంతో అటు గా రాకపోకలు సాగించిన వాహన దారులు తీవ్ర భయాందోళన చెందారు.


సంచరిస్తున్న దున్నలు

15న భీమలింగేశ్వర స్వామి తీర్థం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో గొంప గ్రామంలో ఈనెల 15న భీమలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని సర్పంచి కంట్రెడ్డి గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అదేరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి గుర్రపు పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. రాత్రికి సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో గొట్టువాడ సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించారు. తహసిల్దారు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని, అనుమతులు లేకుండా ఇసుకను తలిస్తే చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు.

చెరుకు గెడలకు గిరాకీ

ప్రజాశక్తి -నక్కపల్లి:సంక్రాంతి పండుగ సందర్భంగా చెరుకు గడలకు డిమాండ్ ఏర్పడింది. ఆటోలు, ఇతర వాహనాల్లో వ్యాపారులు చెరుకు గెడలను తీసుకువచ్చి విక్రయించారు. పలు గ్రామాల్లో చెరుకు గెడలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా చెరకు గెడలు, అరటి పండ్లు పెద్దల చిత్రపటాల వద్ద పెట్టి పూజలు చేస్తారు. ఈ మేరకు వీటికి డిమాండ్ పెరిగింది. వీటితో పాటు కంద, చేమ, గుమ్మడికాయ లకు కూడా డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లలో వీటిని కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. అలాగే వస్త్రాల దుకాణాల వద్ద కూడా రద్దీ ఏర్పడింది.


ఆటోలో తెచ్చి విక్రయిస్తున్న చెరకు గడలు

హోమియో వైద్యాధికారిగా హేమలత

ప్రజాశక్తి-గొలుగొండ
గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యాధికారిగా కిల్లాడ హేమలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ..హోమియో పరంగా ఆసుపత్రి పరిధిలోని ప్రజలకు అన్ని వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని చెప్పారు.



తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి రావికమతం:వేసవికాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గాను ముందస్తు చర్యగా మంచి నీటి బోర్లను వేయించడం జరుగుతుందని మరుపాక ఎంపీటీసీ ముచ్చ సూర్యనారాయణ తెలిపారు. మండలంలో మరుపాక పంచాయితీ పరిధి మరుపాక, దాసరయ్యపాలెం, గొల్లలపాలెం గ్రామాలలో బోరు ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ, ప్రజలు కోరిక మేరకు మూడు లక్షల ఎంపీటీసీ నిధులను వెచ్చించి ఆయా గ్రామాలలో మంచినీటి బోర్లను వేయించడం జరుగు తుందన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎంపిటిసి

పేదలకు బియ్యం, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ: బోగి, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 13వ వార్డు వెర్నిదుర్గానగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పేదలకు బియ్యం, పండ్లను 13వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు కెల్ల సత్యనారాయణ, టిడిపి వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ తురకపూడి బాలస్వామి, జనసేన నాయకులు సంపంగి వాసులు పండ్లు పంపిణీ చేసారు. టిడిపి సీనియర్ నాయకులు పి.ఐ.బాలరాజు, గురుమూర్తి, ఎస్‌సి సెల్ నాయకుడు పట్టా నూకరాజు, కాలనీ అధ్యక్షులు ఒత్తిన వెంకట సత్యనారాయణ, బెహరా భాగ్యరాజు, బండి పైడిరాజు పాల్గొన్నారు.


పంపిణీ చేస్తున్న నేతలు

ఘనంగా బాల యేసు దేవాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట ఆర్‌సిఎం చర్చ్‌లో సోమవారం బాల యేసు దేవాలయం పండుగ 10వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిం చారు. చర్చ్ ఫాదర్ అజెయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖ, శ్రీకాకుళం విజయనగరం, మాడుగుల, చోడవరం, పెద్ద బొడ్డేపల్లి, అనకాపల్లి తదితర చర్చ్‌ల ఫాదర్‌లు హాజరు అయ్యారు. 600 మందికి పైగా క్రైస్తవ భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేవాలయం ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు..


క్రీస్తు సందేశాన్ని బోధిస్తున్న ఫాదర్

మంచినీటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:మంచినీటికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఎల్లన్నపురం గ్రామంలో జల జీవన పథకం ద్వారా మంచినీటి కొళాయిలను సోమవారం సర్పంచ్ గోకివాడ రమణ ప్రారంభించారు. మండలంలో తట్టబంధ పంచాయితీ శివారు ఎల్ఎన్ పురం గ్రామానికి ఇటీవల జలజీవన్ మిషన్ పథకం ద్వారా 30 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు.


ప్రారంభిస్తున్న సర్పంచ్